క్లుప్తంగా

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సాయికుమార్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని సూర్యోదయ పబ్లిక్ స్కూల్ వద్ద తాజ్‌మహల్ ఎగ్జిబిషన్‌ను మేనేజర్ ఏలూరి సాయికుమార్ గురువారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వీల్ చైర్, వాటర్ ఫాల్స్, బ్రేక్‌డాన్స్, జాయింట్ వీల్స్, కొలంబస్ తదితరములను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ముందు భాగం తాజ్‌మహల్ తరహాలో ఏర్పాటు చేశారు. ఇది స్థానికులకు విశేషంగా ఆకట్టుకుంటోంది. కార్యక్రమంలో కోయభాను, శివప్రసాద్, నదివాడ గురుగోపినాథ్, పైడి రమణ, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

పరిశభ్రత మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): పరిశభ్రత మన ఇంటి నుంచి మొదలవ్వాలని, ఎవరి ఇంటి పరిసరాలను వారు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడు ప్రతి వీధి, గ్రామం, పట్టణం, దేశమంతా పరిశుభ్రంగా ఉంటుందని కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు అన్నారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతివారం రెండు గంటలు, సంవత్సరానికి వంద గంటలు పరిశుభ్రత కోసం కేటాయిస్తామని, చెత్త బయట వేయం, వేయనీయమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శశిధర్‌రాజు, జాకీర్ హుస్సేన్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



ధ్రువపత్రాలు అందజేస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణిలో ఐటీఐ అప్రెంటిస్ పూర్తి చేసిన వారికి ఏరియా జీఎం జాన్ ఆనంద్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. గురువారం జీఎం కార్యాలయంలో జీఎం మాట్లాడుతూ.. శిక్షణ పొందినవారు వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులై ప్రతిభ చాటారని పేర్కొన్నారు. మల్లారపు మల్లయ్య, శ్రీనివాస్, నరసింహారాజు, విజయశేఖర్‌బాబు, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

సీతాఫలంతో ఆరోగ్యం మెండు

- అతివృష్టి, అనావృష్టితో ఏటేటా తగ్గుతున్న దిగుబడి
- ఈ ఏడాది ఆలస్యంగా మార్కెట్‌లోకి..



ఇల్లెందులో సీతాఫలాలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

ఇల్లెందురూరల్: చలికాలం ప్రారంభమవుతోంది. ఈ సమయంలో మార్కెట్‌లో లభించే సహజసిద్ధ ఫలం సీతాఫలం. ఈ ఏడాది కొంత ఆలస్యంగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. సీతాఫలాల్లో పోషకాలు మెండుగా ఉంటాయి. మధుమేహం, ఆస్తమా వంటి వ్యాధిగ్రస్తులు మినహా ప్రతిఒక్కరూ వీటిని తీసుకోవచ్చు. ఈ పండులో ఏ, సీ, డీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. స్త్రీలకు ఎదురయ్యే హార్మోన్ల సమస్యను వీటిని తినడం ద్వారా అధిగమించవచ్చు. ఇంతటి ఔషధ గుణాలు కలిగి ఉన్న పేదింటి యాపిల్ రోజురోజుకూ గ్రామీణ ప్రాంతాలకు దూరమై పోతున్నాయి.

తరిగిపోతున్న తోటలు..

వానరాల ప్రభావంతో సీతాఫల తోటలను యజమానులు చాలా వరకు తొలగించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. దట్టమైన సీతాఫల వనాలు పుష్కలంగా ఉండే ఇల్లెందు పరిసర ప్రాంతాలలో ఉపరితల గనుల ప్రభావంతో కనుమరుగయ్యాయి. వీటితోపాటు ఉన్న కాస్త తోటల్లో అతివృష్టి, అనావృష్టి, పూత సమయంలో అధిక వర్షాల ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో కాత తక్కువగా ఉంది. వాతావరణం కూడా సహకరించకపోవడంతో దిగుబడి ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రస్తుత సీజన్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో రుచిలోనూ తేడా కనిపిస్తోంది. ఈ పరిణామం సీతాఫల విక్రయాలపై చూపించే అవకాశం ఉంటుందని చిరువ్యాపారులు పేర్కొంటున్నారు.

తగ్గుతున్న ఉపాధి..

ఇల్లెందు పట్టణంతోపాటు సమీపంలోని పలు గ్రామాలలో ముఖ్యంగా సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న ప్రాంతాలలో పదేళ్ల కిందటి వరకు సీతాఫలాల చెట్లు విస్తారంగా ఉండేవి. ఆయా గ్రామాలలోని అనేక మందికి సీజన్ రాగానే వనాలలో పాకానికి వచ్చిన సీతాఫలాలను కోసి విక్రయించి ఉపాధి పొందేవారు. దీంతో గ్రామంలోనే కాకుండా ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మం పట్టణాల్లో సైతం సీతాఫలాలను తీసుకెళ్లి విక్రయించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. పట్టణంలోని ఓసీ నిర్వాసిత ప్రాంతం విస్తరించడంతో కొంతమేర చెట్లను కోల్పోవాల్సి వచ్చింది.

ఇంతేకాకుండా సమీపంలోని గ్రామాలు విస్తరించడంతో చెట్లు కనుమరుగయ్యాయి. దీంతో సీజన్‌లో సీతాఫలాలు విక్రయించే కుటుంబాలు కూరగాయల విక్రయాలకు మారిపోతున్నారు. అలాగే నానాటికీ అంతరించిపోతున్న అటవీ ప్రాంతం మూలంగా సీతాఫల వనాలు ధ్వంసమవుతున్నాయి. దీంతో ఏజెన్సీ గ్రామాలకు సైతం ఉపాధి లేకుండా పోతోంది.

సంపూర్ణ ఆరోగ్యం..

చలికాలం ప్రారంభంలో లభించే సీతాఫలం తినడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని వైద్యులు సూచిస్తున్నారు. 100 గ్రాముల సీతాఫలం తింటే 94 క్యాలరీల శక్తి లభిస్తుంది. తక్కువ బరువు ఉన్న వాళ్లే వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు బరువు పెరుగుతారు. ఈ పండ్లలో విటమిన్ బి ఉండటం వల్ల రోగనిరోధ శక్తి పెరుగుతుంది. మొటిమలు, జుట్టురాలిపోవడం, తామర, చర్మం పొడిబారడం, వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండులో ఒమేగా ఆమ్లాలు సమృద్ధిగా ఉండటంతో మెదడు పెరుగుదల, జ్ఞాపశక్తికి సహకరిస్తుంది. దగ్గు, కడుపులో మంట, వాంతులు, ప్రమాదకర కణతుల నివారణకు సీతాఫలం ఉపయోగపడుతుంది. అంతేకాకుండా కాలేయ, పేగు వ్యాధుల నుంచి కాపాడి జీర్ణశక్తి సాఫీగా సాగేలా చేస్తుంది. వీటిలో ఉండే ఎసిటోజెనిస్ రసాయనాలు శరీరంపై ముడతలు పడకుండా చర్మాన్ని కాంతిమయంగా ఉంచుతాయి. ఇంతటి ఔషధ గుణాలు కలిగి ఉన్న సీతాఫలాలు రానున్న రోజుల్లో మరింత ప్రియంకానున్నాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

చెట్లు తగ్గిపోయాయి



సింగరేణి గనుల సమీపంలో విస్తారంగా ఉన్న చెట్ల నుంచి సీతాఫలాలను కోసి విక్రయించడం ద్వారా మా ప్రాంత ప్రజలు ఏడాదిలో కనీసం రెండు నెలలైనా ఉపాధి పొందేవారు. నేడు వనాలు కనుమరుగవడంతో ఆ కాస్త ఉపాధి కూడా లేకుండా పోయింది.

– హరిసింగ్, విజయలక్ష్మీనగర్, ఇల్లెందు

రుచిలో తేడా ఉంటున్నాయి



గతంలో ఇల్లెందు ప్రాంతంలో కాసే సీతాఫలాలు ఎంతో రుచిగా ఉండేవి. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు సీతాఫలాలు అంతగా దొరకడం లేదు. ఇప్పుడొచ్చే పండ్లు కూడా రుచిగా కూడా ఉండటం లేదు.

– దుర్గారావు, ఉద్యోగి, ఇల్లెందు

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో గురువారం డివిజన్ స్థాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయి క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఏటీడీఓ రూపాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో నైపుణ్యం ప్రదర్శించి స్నేహపూర్వకంగా పోటీలలో పాల్గొన్నారని అభినందించారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన జట్లు నవంబర్ 3, 4 తేదీలలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. 13, 14, 15 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, హెచ్‌ఎంలు, పీఈటీలు వెంకటరమణ, రవి, శారద, నారాయణ, శ్యామ్యూల్, హతీరాం, హర్యా, రాంబాబు, బాలరాజు, శిరోమణి, సైదులు, బుగ్గ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సమాచారం ఇవ్వడం లేదు

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ కార్యక్రమాలకు ఉద్యమకారులు, సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు, ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు అన్నారు. గురువారం గుండెపుడి ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు భూక్యా దేవీలాల్ నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలకు, బూత్ కమిటీల సమావేశాలకు ఉద్యమకారులు, పార్టీ సీనియర్ నాయకులకు ఆహ్వానించకుండా ఏకపక్షంగా వ్యవరిస్తే బీఆర్‌ఎస్‌కు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో సీఎం కేసీఆర్ పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులు, సీనియర్ నాయకులకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బానోత్ బిక్కు, రవికుమార్, లావుడ్యా దంజు, వాంకుడోత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు స్థానచలనం

పాల్వంచరూరల్: నలుగురు గ్రామపంచాయతీ కార్యదర్శులను డీపీఓ రమాకాంత్ గురువారం బదిలీ చేశారు. నాగారం గ్రామపంచాయతీ కార్యదర్శి రాధిక ఇల్లెందుకు బదిలీ కాగా ఆమె స్థానంలో దుర్గారావు ఇక్కడికి వచ్చారు. కేశవాపురం పంచాయతీ కార్యదర్శి టి.శైలజ అశ్వాపురానికి బదిలీ కాగా ఆమె స్థానంలో కృష్ణవేణి ఇక్కడికి బదిలీ అయ్యారు. తవిశలగూడెం పంచాయతీ కార్యదర్శి జె.శ్రీనివాసరావు ములకలపల్లి మండలం కమలాపురానికి బదిలీ కాగా అయిన స్థానంలో సంధ్య ఇక్కడికి వచ్చారు. కొత్తసూరారం పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి మల్లెలమడుగుకు బదిలీ కాగా ఆమె స్థానంలో హిమబిందు ఇక్కడికి వచ్చారు.

సివిల్ కానిస్టేబుల్‌కు సన్మానం



విద్యావతిని సన్మానిస్తున్న ప్రతాప్, స్థానికులు

టేకులపల్లి: మద్రాస్ తండా పంచాయతీ, కొండంగుల బోడ్ గ్రామవాసి జర్పుల సుందర్ కుమార్తె విద్యావతి ఇటీవల సివిల్ కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ గురువారం విద్యావతికి శాలువా కప్పి సన్మానం చేశారు. మాట్లాడుతూ.. ఇలాంటి మారుమూల గ్రామాలలో గిరిజన బిడ్డలు చదువుకొని ఉద్యోగం సంపాదించుకోవడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో అరుణ్, వినోద్, తరుణ్, సంతోష్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోండి



సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు

ఇల్లెందు: మలి దశ తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గురువారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో నేతలు ఆదూరి రవి, లకావత్ దేవీలాల్ నాయక్, భావ్‌సింగ్‌నాయక్, ఎర్రబెల్లి కిష్టయ్య, పొన్నం సుబ్బారావు, సిరిమల్ల రాజు, డేరంగుల పోషం, బచ్చల రాజు, నర్సింగ్, రాంచందర్ పాల్గొన్నారు. ఉద్యమకారులకు 500 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు, ప్రతీనెల రూ.25 వేల పెన్షన్, నామినేటెడ్ పదవులు కేటాయించాలని, ఉద్యమకారుల కమిషన్ ఏర్పాటు చేయాలని పలు డిమాండ్లను ఆమోదించారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



పడమటనర్సాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: పడమటనర్సాపురం, రాచబండ్ల కోయగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పడమటనర్సాపురం-2, రాచబండ్లకోయగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ పోషణ్ వాటికా కార్యక్రమానికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ రెండు సెంటర్లలో సేంద్రియ ఎరువులతో ఔషధ మొక్కలు, ఆకుకూరలు, కూరగాయలతోపాటు, పండ్ల మొక్కలను పెంచాలన్నారు. కేంద్రాల్లో పెంచే ఆకుకూరలు, కూరగాయలతో గర్భిణులు, బాలింతలకు భోజనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, నాగమణి, శంకుతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నోడల్ అధికారి పర్యటన



ఎన్నికల నియమావళి పనులను పరిశీలిస్తున్న విద్యాలత

చుంచుపల్లి: ఎన్నికల నోడల్ ఆఫీసర్ మెరుగు విద్యాలత గురువారం పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. నందాతండా, విద్యానగర్ కాలనీ, బాబు క్యాంప్, రుద్రంపూర్, గౌతమ్ పూర్, పెనగడప గ్రామపంచాయతీల్లో తనిఖీలు నిర్వహించారు. స్వయంగా దగ్గరుండి వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించే పనులను పర్యవేక్షించారు. మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు జరుపుల రవి, బొంతు బాబురావు, కె.వెంకటేశ్వర్లు, హనుమంతు, చెన్నకేశవులు, ఎం.జ్యోతి, సత్యనారాయణ గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కాశయ్య



హాజరైన సెక్టార్ అధికారులు

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారి జె.కాశయ్య తెలిపారు. గురువారం ఇల్లెందు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సెక్టార్ అధికారుల సమావేశంలో 37 సెక్టార్లలకు చెందిన అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎన్నికల పోలింగ్ రోజున సెక్టార్ పరిధిలో పోలింగ్ నిర్వహణ, మెటీరియల్ సరఫరా లాంటి అన్ని అంశాలను బాధ్యతతో నిర్వహించాల్సి ఉందన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే పైఅధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.రవికుమార్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు 'సంక్షేమం' అందించడమే లక్ష్యం



పార్టీలో చేరిన వారితో కోరం కనకయ్య

టేకులపల్లి: ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధు ప్రభుత్వ అధికారులపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి ఉమ్మడి గ్రామ పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్, ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రానుందని, కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా టేకులపల్లి, మోదుగులగూడెం, బర్లగూడెం గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, బర్లగూడెం ఉప సర్పంచ్ పలువురు కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భూక్యా దేవా నాయక్, గుండా నరసింహారావు, బండ్ల శ్రీనివాస్, ఉండేటి ప్రసాద్, బోడా సరిత, పూనెం ఉమ పాల్గొన్నారు.

'గూడెం'లో కాంగ్రెస్‌ను గెలిపించుకుంటాం..



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొత్తగూడెంలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేసి గెలిపించుకుంటామని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాయకులు నాగా సీతారాములు, వూకంటి గోపాల్‌రావు అన్నారు. గురువారం స్థానిక దమ్మపేట సెంటర్‌లోని ఓ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం సీటు జనరల్ కావడంతో పలువురు నేతలు పోటీ పడటం సహజమేనన్నారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నాగా సీతరాములు, పోట్ల నాగేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ తదితరులు పోటీ పడుతున్నారని వారిలో ఎవరికి సీటు ఇచ్చినా కట్టుబడి ఉంటామని చెప్పారు. ఇప్పటి వరకు వర్గాలు ఉన్నామని, కానీ ఇప్పుడు ఏకతాటిపైకి వచ్చి పనిచేసేందుకు అందరం కలిసామన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి ఈ సారి తెలంగాణాలో అధికారం తెచ్చి కానుకగా ఇవ్వడమే లక్ష్యం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అవినీతికి అంతులేకుండా పోయిందని, దళితులకు మూడు ఎకరాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లాంటి హామీ లేమీ అమలు కాలేదని, ఇప్పటికే సుమారు రూ.ఐదు లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని, ఈసారి పథకాల పేరుతో మరో రూ.రెండు లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. నూకల రంగారావు, జాలే జానకి రెడ్డి, తూము చౌదరి, తుమ్మల శివారెడ్డి, ఐతా గంగాధర్, బద్ది కిశోర్, నాగేంద్ర త్రివేది, చాంద్‌పాషా, పెంకి శ్రీను, పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పలువురు నాయకులు తమను స్టేజ్ మీదకు పిలవలేదని ఘర్షణకు దిగారు. బద్ది కిశోర్ అశ్వారావుపేట నియోజక వర్గం ఎల్‌డీఎం ఇన్‌చార్జ్‌గా ఉన్నానని తనను పిలవలేదని మధ్యలోనే వెళ్లిపోయారు.

విద్యార్థులు దేశభక్తిని చాటాలి



జాతీయ జెండాలతో విద్యార్థులు, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: జీవితంలో ప్రతి విద్యార్థి దేశం పట్ల గౌరవం, అభిమానం, సేవా దృక్పథం, త్యాగం వంటి విషయాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలకు చెందిన ప్రతి విద్యార్థి తమ ఇంటి నుంచి పిడికెడు తెచ్చి కళాశాలలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పోసి అందులో ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకునేలా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు శేఖర్, చెంచురత్నయ్య, రమేష్, ఇంద్రాణి, శారద, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ప్రకృతి రమణీయతకు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, భక్తిభావానికి ప్రతీకైన బతుకమ్మ సంబరాలను ముందస్తుగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పండుగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో సందడి చేశారు. ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: పాఠశాలలో బతుకమ్మ పండుగ సందడి



టేకులపల్లి మాంటిస్సోరి పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..



సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్ జెడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



పాల్వంచరూరల్: ఉల్వనూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో..



జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మలతో బాలికలు, ఉపాధ్యాయులు



ఇల్లెందురూరల్: బతుకమ్మలతో సుభాష్‌నగర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



బతుకమ్మతో ఏటీడీఓ రూపాదేవి



సుజాతనగర్: శ్రీవాణి నికేతన్‌లో..



ఇల్లెందు: మాంటిస్సోరి స్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాలు